సాక్షి పెద్దపల్లి

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023

రావయ్యా.. గణపయ్యా





ఆది దంపతుల ప్రియసుతుడు, సర్వ విఘ్నాలు తొలగించే గణనాథుడు భూలోకంలో భక్తుల కోరికలు తీర్చేందుకు విచ్చేస్తున్నాడు. ఆయనకు స్వాగతం పలికేలా మంటపాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసారి మట్టి గణపతినే పూజించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేలా తనను మట్టిరూపంలో కొలిచేందుకు సిద్ధమైన భక్తుల కోరికలు తీర్చాలన్న ఆకాంక్షతో వినాయకుడు మరికొద్ది గంటల్లోనే భువిపైకి చేరనున్నాడు. ఈ సాయంత్రం నుంచి నవరాత్రులపాటు ఘనమైన పూజలందుకోనున్నాడు. తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర ప్రత్యేక కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మికశోభ సంతరించుకోనుంది. వినాయక చవితి విశిష్టత.. పూజావిశేషాలతో ప్రత్యేక కథనం..

- వివరాలు 8లో►

న్యూస్‌రీల్

పోలీస్ కమిషనరేట్‌లో జాతీయ సమైక్యత వేడుకలు



జెండా ఎగురవేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీపీ రెమా రాజేశ్వరి జెండా ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బందికి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు ఇతర విభాగాలకు చెందిన పోలీస్, సీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్ర ముందుతరాలకు అందించాలి



విశ్వకర్మ వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: విశ్వకర్మ చరిత్రను భావితరాలకు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశ్వకర్మ వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. విశ్వకర్మ దైవ రూపంగా, ఆధ్యాత్మికత, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా అధికారిక సెలవు ప్రకటించాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ప్రజాప్రతినిధులు, విశ్వకర్మ కుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంథనిలో స్వచ్ఛతాహీ సేవా వార్షికోత్సవాలు

మంథని: స్వచ్ఛతా హి సేవా వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మంథని మున్సిపాలిటీలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, కమిషనర్ సతీశ్, కౌన్సిలర్లు వీకే రవి, సీపతి బానయ్య ఉన్నారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ



మాట్లాడుతున్న భానుప్రసాద్ రావు. చిత్రంలో ఎమ్మెల్యే దాసరి, జెడ్పీ చైర్మన్ మధు, కలెక్టర్, డీసీపీ

- తొమ్మిదేళ్ల స్వరాష్ట్ర పాలనలో అగ్రగామిగా నిలిచాం
- భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడడమే నిజమైన దేశభక్తి
- శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు
- కలెక్టరేట్‌లో జాతీయ సమైక్యత వేడుకలు

పెద్దపల్లిరూరల్: సుదీర్ఘకాల పోరాటం.. అమరుల త్యాగ ఫలితంగానే ప్రత్యేక రాష్టాన్ని సాధించుకోగలిగామని, ఈ స్వరాష్టాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుతూనే దేశానికే ఆదర్శంగా నిలిచిందని శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాదరావు అన్నారు. ఆదివారం జాతీయసమైక్యతా దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జెడ్పీ చైర్మన్ పుట్టమధుకర్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, డీసీపీ వైభవ్‌గైక్వాడ్, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా భానుప్రసాదరావు పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు.

అంతర్భాగానికి 75 ఏళ్లు

రజాకార్లు, నిజాంల పాలననుంచి 75 ఏళ్ల క్రితం విముక్తి పొందిన తెలంగాణ దేశంలో అంతర్భాగమైందని భానుప్రసాదరావు గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన రోజును జాతీయ సమైక్యత దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. విభిన్న సంస్కృతులు, ప్రజల మధ్య సమైక్యతే జాతీయ సమైక్యత అని పేర్కొన్నారు.

స్వరాష్ట్రం దేశానికే ఆదర్శం

సుదీర్ఘకాల పోరాటం.. త్యాగధనుల అమరత్వంతో సాధించుకున్న తెలంగాణ అవతరించిన 9ఏళ్లలోనే దేశానికే ఆదర్శంగా నిలిచిందని భానుప్రసాదరావు స్పష్టం చేశారు. రాష్టం రాకముందు తెలంగాణ ప్రజానీకం విద్యుత్, తాగునీటికి ఇబ్బంది పడ్డారని, స్వరాష్ట్రంలో ఆ బాధలన్నీ దూరమయ్యాయని గుర్తు చేశారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు సాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. చెరువుల్లో పూడికతీతకు మిషన్‌కాకతీయతో పాటు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల వంటి భారీ ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ ప్రారంభించారని పేర్కొన్నారు. రైతాంగ సంక్షేమం కోసం రైతుబీమా, రైతుబంధు పథకాలతోపాటు సాగుకు సూచనలిచ్చేందుకు రైతువేదికల నిర్మాణాలను చేపట్టిన ఏకైక రాష్టం తెలంగాణ మాత్రమేనన్నారు. నిరుపేదలు, దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించేందుకు మోడల్‌స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ రేణుక, ఏసీపీ మహేశ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న భానుప్రసాద్

పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి

మంథని: పెద్దపల్లి పార్లమెంట్ టికెట్‌ను మాదిగ కులస్తులకే కేటాయించాలని మాదిగ ఐక్య వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఏర్పడినప్పటి నుంచి కేవలం ఒకసారి మాత్రమే మాదిగలకు అవకాశం ఇచ్చారని, ఈసారి తమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించేలా అన్ని పార్టీలూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్టోబర్ 5న గోదావరిఖనిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి బొంకూరి రమేశ్, బచ్చలి రాజయ్య, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంథని చందు, నాయకులు కాంపల్లి ప్రభాకర్, మంథని రాకేష్, లింగయ్య, తిరుపతి, నవీన్, ప్రసాద్, ఆకాశ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బాపయ్య

ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలకు ప్రభుత్వం వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతుందని, ఇందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే బదిలీలు, పదోన్నతులను చేపట్టిందని పేర్కొన్నారు. మన ఊరు మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. పీఆర్టీయూ నాయకులు బీరెల్లి కమలాకర్ రావు, కద్రు సురేశ్, కృష్ణమూర్తి, ఇన్నారెడ్డి, తిరుపతిరెడ్డి, జైపాల్ రెడ్డి, జాలి మహేందర్ రెడ్డి, రవినందన్ రావు, శ్రీధర్‌రావు, శ్రీనివాస్, రాజమౌళి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

విచ్ఛిన్నకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పెద్దపల్లిరూరల్: స్వరాష్టంగా ఏర్పడిన తెలంగాణ సీఎం కేసీఆర్ సారథ్యంలో అద్భుత ప్రగతి సాధిస్తోందని, జీర్ణించుకోలేని విపక్షాలు కులం, మతం పేరిట సమాజంలో చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతున్నాయని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం మండలి ఛీఫ్‌విప్ భానుప్రసాదరావు, జెడ్పీచైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేశారు. కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ సమైక్యత, సమగ్రతకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులున్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని: జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరుకంటి జాతీయ జెండా ఎగురవేశారు. ఆనాటి యోధుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. 1948 సెప్టెంబర్ 17న నాటి హైదరాబాద్ సంస్థానం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యంలోకి అడుగుపెట్టిందన్నారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, అంతర్గాం జెడ్పీటీసీ నారాయణ, కార్పొరేటర్లు కొమ్ము వేణుగోపాల్, దొంత శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, అడ్డాల గట్టయ్య, బాల రాజ్ కుమార్, జంగంపల్లి సరోజన, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజిని, నాయకులు మాదాసు రాంమ్మూర్తి, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న చందర్

ఫలిస్తున్న ఆరు దశాబ్దాల కల

- కొనసాగుతున్న కుర్జుకమ్మి భూముల సర్వే
- 193 సర్వే నంబర్లలో 1,018 ఎకరాలు
- అసైన్డ్ పట్టాల పంపిణీ తరువాయి
- రైతుల్లో హర్షాతిరేకాలు



ఏడీ సమక్షంలో కొనసాగుతున్న భూసర్వే

రామగుండం: అజామాబాద్ ఇండస్ట్రియల్ పేరుతో అప్పటి నిజాం ప్రభుత్వం నామమాత్రపు ధరలకు సేకరించిన (కుర్జుకమ్మి) భూములను ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. ఆ భూములకు ఇప్పటికే సాగులో ఉన్న రైతులకు అసైన్డ్‌పట్టాలు జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. భూములకు సంబంధించిన సర్వే నేడో, రేపో ముగియనుంది. ఇక పట్టాల పంపిణీయే మిగిలిఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ భూములకు ఎకరాకు రూ.20లక్షల వరకు ధర పలుకుతోంది.

కుర్జుకమ్మి అంటే..

పట్టాదారు పేరును ఖాతా నుంచి తొలగించి.. ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని నిరుపయోగంగా ఉంచే భూములను కుర్జుకమ్మి అంటారని సర్వే అధికారులు చెబుతున్నారు. ఇదే కోవలో రాయదండి, పెద్దంపేట, గోలివాడ శివారులో 3,696.32 ఎకరాలు విస్తరించి ఉన్నాయి. ఈ భూములను అప్పటి నిజాం ప్రభుత్వం తమ నుంచి స్వాధీనం చేసుకుని నిరుపయోగంగా ఉంచిందని, వాటిని తిరిగి తమకు అప్పగించాలని రైతులు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు స్పందించిన ప్రభుత్వం ప్రస్తుతం రాయదండి శివారులోని 193 సర్వేనంబర్లలో 1,018 ఎకరాలను సర్వే చేయిస్తోంది.

తుది దశకు భూసర్వే

ఈనెల 5న జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పెద్దంపేటలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కుర్జుకమ్మి భూములను సర్వే చేస్తున్నామని, పది రోజుల్లో నివేదిక అందిస్తామని వెల్లడించారు. ఆరో తేదీ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో సర్వేబృందం సర్వే చేస్తోంది. ఇప్పటికే 980 ఎకరాల సర్వే పూర్తయ్యింది. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. 1,018 ఎకరాల కుర్జుకమ్మి భూముల్లో 600 మంది రైతులు ఉన్నారని, 185 ఎకరాలు బీపీఎల్ విద్యుత్ కేంద్రానికి కేటాయించినట్లు అధికారులు గుర్తించారు. 250 మంది పక్కా గృహాలు నిర్మించుకున్నారు. భూమి శిస్తు చెల్లిస్తూ ప్రస్తుతం మొఖాపై (కబ్జాలో) ఉన్నవారిని యజమానులుగా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం



పదిరోజులుగా కుర్జుకమ్మి భూములను సర్వే చేస్తున్నాం. సాగు భూములు, కబ్జాలో ఉన్న రైతుల వివరాలు, పక్కాగృహాలు, తదితర అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. ఇద్దరి మధ్య లిటిగేషన్ ఉంటే ఆ భూమి వివరాలను పెండింగ్‌లో పెట్టి రాజీ కుదిరిన తర్వాతే సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్

పట్టా రానుంది



కుర్జుకమ్మి భూమిలో ఇల్లు నిర్మించుకున్నాం. ఇంటికి దస్త్రాలు లేవు. బ్యాంకుల నుంచి రుణం తీసుకునే అవకాశం లేదు. ప్రస్తుతం సాగు భూములకు అసైన్డ్ పట్టాలు జారీ చేయనున్నారు. ఇళ్లకు పట్టాలు ఇవ్వనున్నారని సంతోషంగా ఉంది.

– గుజ్జుల రాఘవరెడ్డి

అసైన్డ్ పట్టాలకు మోక్షం



60 ఏళ్లుగా రెండు పంటలు పండించుకుంటున్నం. కానీ యజమానులం అని చెప్పుకోలేని పరిస్థితి. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషి ఫలితంగా అసైన్డ్ పట్టాలు ఇవ్వనుండడం శుభపరిణామం.

– కరివేద రాజిరెడ్డి, రైతు, పెద్దంపేట

గర్వంగా చెప్పుకోవచ్చు



మాకు పదెకరాల భూమి ఉంది. అయినా హక్కుదారులం కాకపోవడంతో ఆస్తిగా పరిగణించే పరిస్థితి లేదు. ఇప్పుడు అసైన్డ్ పట్టాలు జారీ చేయనుండడంతో కుటుంబ ప్రతిష్ట పెరగనుండడంతో సంతోషంగా ఉంది.

– ఆముల శ్రీనివాస్, రైతు, పెద్దంపేట

మహాకాయ.. పార్వతి తనయ



నేటి నుంచి వినాయక నవరాత్రోత్సవాలు

గోదావరిఖని(రామగుండం): మహాకాయుడు.. పార్వతి తనయుడు.. సర్వ విఘ్న వినాశకుడు వినాయకుడి చవితి వేడుకలకు ప్రజలు సమాయత్తమయ్యారు. వేదకాలం నాటికే గణపతి పూజనీయుడైన దేవుడు. గజాననుడు, గణపతి, ఏకదంతుడు, లంబోధరుడు.. ఇలా ఎన్నో పేర్లతో భక్తులతో పూజలందుకుంటాడు. ఆబాల గోపాలానికి ఆరాధ్య దైవ్యం. ఏ కార్యం ప్రారంభించినా.. ఏ పూజ నిర్వహించినా మొదట పూజించేది వినాయకుడినే. భాద్రపద శుద్ధ చవితి స్వామి వారి పుట్టినరోజు కావడంతో వినాయకచవితి పర్వదినం లోక ప్రసిద్ధి చెందింది. చిన్న కండ్లు సూక్ష్మ బుద్ధికి, తొండం స్వీయ గౌరవానికి, పెద్ద చెవులు సకల విశేషాలను ఆకళింపు చేసుకోవడానికి, పెద్ద బొజ్జ రహస్యాలను దాచి ఉంచుకోవడానికి ప్రతీకలు. సోమవారం వినాయకచవితి సందర్భంగా కథనం..

గణపతులు 32 రూపాలు

- తంత్రశాస్త్రంలో గణపతులు 32 రూపాలుగా వర్ణించబడ్డాయి. భక్తి గణపతి, లక్ష్మీగణపతి, సిద్ధి గణపతి, భువనేశ గణపతి, హేరంబ గణపతి, మహాగణపతి, విఘ్నరాజ గణపతి, ఊర్ధ్వ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, శక్తి గణపతి, ధ్వజ గణపతి అనే 16 రూపాలు ఎక్కవ ప్రచారం లో ఉండగా, శ్రీవిజయ గణపతి, ఏకాక్షర గణపతి, వర గణపతి, త్ర్యక్షర గణపతి, హరిద్ర గణపతి, ఏకదంత గణపతి, సృష్టి గణపతి, ఉద్దండ గణపతి, రుడ్ని గణపతి, దుండిగణపతి, ద్విముఖ గణపతి, త్రిముఖ గణపతి, సింహ గణపతి, యోగ గణపతి, శ్రీసంకటహర గణపతి అన్నవి అంతగా ప్రచారంలో లేవు.

వ్రత విధానం

- చవితినాడు ఉదయం స్నానానంతరం నిత్యకర్మలు పూర్తి చేసుకుని శక్తిని బట్టి బంగారం, వెండి, మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను ఇంట్లో ఉత్తరం దిశలో బియ్యం పోసి మండపాన్ని నిర్మించాలి. అష్టదళ పద్మాన్ని రూపొందించి వినాయకున్ని ప్రతిష్ఠించాలి. శ్వేత గంధ అక్షతలు, పుష్పాలు ఏకవింశతి పత్రాలతో అర్చించాలి. ధూప, దీపాలు, వెలగ, నేరేడు తదితర ఫలాలను రకానికి 21 చొప్పున నివేదించాలి. త్రిలోక ప్రసిద్ధమైన ఈ వ్రతాచరణతో గణపతి అనుగ్రహం కలిగి సర్వ కార్యాలూ నెరవేరుతాయి. ఈ వ్రతాచరణ ఫలితంగానే విదర్భ రాజ యువరాణి దమయంతి నల మహారాజును, శ్రీకృష్ణుడు శమంతక మణి, జాంబవతి, సత్యభామకు ఇష్ట సఖుడయ్యాడు.



విదేశాల్లో సైతం గణపతి ఆరాధన

“ గణపతి ఆరాధన కేవలం మన దేశానికే పరిమితం కాదు. శ్రీలంక, టిబెట్, నేపాల్, థాయ్‌లాండ్, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, మధ్యఆసియా, జావా, బలిద్వీపం, బోర్నియా, మంగోలియా, కంబోడియా, బర్మా, చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో కూడా వినాయకుడిని వారి వారి సంప్రదాయాల్లో రూపొందించి ఆరాధిస్తారు.

క్లుప్తంగా

విద్రోహ దినంగా పాటించాలి



మాట్లాడుతున్న వెంకన్న

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సెప్టెంబర్ 17న తెలంగాణ విద్రోహ దినంగా పాటించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకుడు వెంకన్న అన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో పోలీస్ చర్య పేరుతో వేలాది బలగాలను తెలంగాణలో మోహరించి ప్రజలపై దాడులు చేసిన దినాన్ని తెలంగాణ విద్రోహ, చీకటి రోజుగా పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అశోక్, బుచ్చమ్మ, పద్మ, శంకర్, మల్లికార్జున్, కవిత, గట్టయ్య, ప్రకాష్, రాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఇరవేని రాజ్‌కుమార్(19) శనివారం అర్ధ రాత్రి దాటాక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ స్థానికంగా ఓ టెంట్‌హౌజ్‌లో పనిచేసేవాడు. రోజూ మద్యం తాగుతుండటంతో తల్లి తాగవద్దని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రాజ్‌కుమార్ గ్రామ శివారులోని హనుమాన్ గుడివద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 1గంట సమయంలో మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



రాజయ్య (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన రైతు పసునూటి రాజయ్య అలియాస్ రాజిరెడ్డి (58) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాజయ్య శనివారం తన పొలానికి నీళ్లు పెట్టి వస్తానని భార్య సరోజనకు చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కొడుకు శ్రావణ్ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మద్యం అలవాటు ఉన్న రాజయ్య వస్తాడులే అని అనుకున్నారు. ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన తీగుల్ల ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయ భూమి కౌలుదారు గన్ను కోటేశ్వర్‌రెడ్డి మోటారు పెట్టేందుకు బావి వద్దకు వెళ్లగా రాజయ్య మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

మళ్లీ మోదీనే ప్రధాని కావాలి



రక్తదానం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రధానిగా నరేంద్రమోదీ దేశానికి నీతివంతమైన పాలన అందిస్తున్నారని, మళ్లీ ఆయనే ప్రధాని కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పర్వతాలు అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా ఆలయాల్లో పూజలు చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం చేశారు. నాయకులు దాడి సంతోష్, రాజేశ్వర్‌రావు, రాజంమహంత, మేకల శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్, కోదాటి వెంకటరమణ, శ్రీకాంత్, రాజేందర్, రమేశ్, అంజి, సురేశ్ తదితరులున్నారు.

కాళోజీ పురస్కారం అందుకున్న హోంగార్డు



పృథ్వీరాజ్‌ను సత్కరిస్తున్న తెలుగువెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు

పాలకుర్తి: పోలీస్‌శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పాలకుర్తి మండలం కన్నాల శాలపల్లికి చెందిన భీమనపల్లి పృథ్వీరాజ్ సామాజిక సేవారంగంలో కాళోజీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలుగువెలుగు సాహితీ వేదిక అనే స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి పురస్కారాలు అందించింది. ఇందులో భాగంగా పృథ్వీరాజ్ 14 ఏళ్లుగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధిగా పనిచేస్తూ.. నేత్ర, అవయవ, శరీరదానాలపై చేసిన సేవలను గుర్తించి కాళోజీ పురస్కారం అందజేశారు. డీసీపీ గిరిధర్, సరస్వతీ దేవీ ఉపాసకులు శ్రీదైవజ్ఞశర్మ చేతులమీదుగా పురస్కారం అందించి పూలమాల, శాలువాతో సత్కరించి మెమోంటోను బహూకరించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

నవరాత్రులు.. నేతలకు చందాల తలనొప్పులు

- నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబు
- 15 నుంచి 20 శాతం పెరిగిన ధరలు
- నేటి నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు



నవరాత్రి ఉత్సవాలకు మండపాన్ని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): గణపతి నవరాత్రి ఉత్సవాలకు వేళయింది. ఈనెల 18 నుంచి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా మరో మూడు నెలల్లో ఎన్నికలు ఉండడంతో గతంకన్నా ఈ సారి పెద్ద సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష పార్టీలోని ఆశావహులు వినాయక విగ్రహాల ఏర్పాటుకు యువజన సంఘాలకు, ఉత్సవ మండళ్ల నిర్వాహకులకు ఉదారంగా చందాలు ఇవ్వనుండడంతో నవరాత్రోత్సవాల్లో మరింత సందడి చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఏటా సుమారు 800 నుంచి1,250 వరకు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఎన్నికల సీజన్ నేపథ్యంలో ఈసారి విగ్రహాల సంఖ్య పెరిగే అవకాశముంది.

పెరిగిన ధరలు

వినాయక విగ్రహాల తయారీ ముడిసరుకు ధరలు పెరిగాయి. దీంతో విగ్రహాల ధరలు గతేడాదికన్నా 15 నుంచి 20 శాతం పెంచారు. ఆరడుగులు ఆపై ఎత్తు ఉన్న విగ్రహాల ధరలు రూ.8,500 నుంచి రూ.పదివేలకు పూగా ధర పలుకుతోంది.

నిబంధనలు

గణేశ్ ఉత్సవ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలి. లేకుంటే నిబంధనల ఉల్లంఘన కింద పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి ముందుగా పొందిన అనుమతి పత్రాల (ఎన్‌వోసీ)తో పాటు పూర్తి వివరాలను దరఖాస్తుతో జత చేయాలి. మండపాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఇరుకు వీధులు, రద్దీ ప్రాంతాలు, మూలమలుపుల్లో మండపాలు ఏర్పాటు చేయరాదు. ఊరేగింపులు నిర్వహించే పక్షంలో పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. మండపాల వద్ద లౌడ్‌స్పీకర్లు, డీజేలు పెట్టి శబ్దకాలుష్యానికి పాల్పడరాదు. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు బంద్ చేయాలి. విగ్రహాల ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా ఎలాంటి నినాదాలు, ప్రసంగాలు, ప్రకటనలు చేయరాదు. బాణాసంచా పేల్చొద్దు. కర్రలు, ఆయుధాలు ఉపయోగించొద్దు.

నిబంధనలు పాటించాలి



గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. మండపాల వద్ద భక్తితో మెలగాలి. ఇతర కార్యకలాపాలకు దూరంగా ఉండాలి.

– ఎడ్ల మహేశ్, ఏసీపీ, పెద్దపల్లి

ప్రశాంతంగా జరుపుకోవాలి



గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు, భక్తులు ప్రశాంతంగా, భక్తిభావంతో జరుపుకోవాలి. ఆ దేవుని ఆశీస్సులు అందరిపై ఉండి సుఖశాంతులతో జీవించాలి.

– దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పెద్దపల్లి

యాక్టింగ్ క్లర్క్‌ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యాక్టింగ్ క్లర్క్‌లు

గోదావరిఖని(రామగుండం): యాక్టింగ్ క్లర్క్‌ల సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. యాక్టింగ్ క్లర్క్‌లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం అందజేసిన వినతి స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా పదేళ్లుగా క్లరికల్ సిబ్బందిగా చేస్తున్న కార్మికులకు పదోన్నతులు కల్పించాలన్నారు. అన్ని పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న క్లరికల్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరీశ్, సాయివేన సతీష్, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, పెంచాల వెంకటస్వామి, తుమ్మగట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోండి.. డాక్టర్ అవుతా

- నీట్‌లో 445 మార్కులు సాధించిన ఆదిత్య
- పై చదువులకు దాతల సాయం కోసం ఎదురుచూపులు



తల్లిదండ్రులతో ఆదిత్య

సుల్తానాబాద్(పెద్దపల్లి): డాక్టర్ చదువుకు దాతలు సహకరించాలని కోరుతున్నాడు నిరుపేద విద్యార్థి. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి శ్రీనివాస్–సంధ్య దంపతులకు ఇద్దరు కుమారులు. స్థానికంగా వడ్రంగి వృత్తి సాగకపోవడంతో 20 ఏళ్ల క్రితం విజయవాడకు వలస వెళ్లారు. అక్కడ కొద్ది రోజులు వెల్డర్‌గా పనిచేసి, తర్వాత హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు ఆదిత్య చదువులో చురుకుగా ఉంటూ పదో తరగతిలో 9.5 జీపీఏ, ఇంటర్‌లో 960 మార్కులు సాధించాడు. నీట్‌లో 445 మార్కులు రావడంతో వరంగల్ ప్రతిమ కళాశాలలో సీటు వచ్చింది. డాక్టర్ సీటు వచ్చినా పేద కుటుంబం కావడంతో చదివించే స్థోమత లేదు. దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.

కొత్తూరి శ్రీనివాస్

బ్యాంక్ అకౌంట్ నంబర్	: 62454579533
ఐఎఫ్‌సీ కోడ్	: SBIN0020136
గూగుల్ పే, ఫోన్‌పే	: 95026 63909

సీపీఆర్‌ఎంఎస్ కార్డుకు మరో అవకాశం



సూర్యనారాయణ, ఆర్జీ–2 జీఎం

గోదావరిఖని(రామగుండం): సీపీఆర్‌ఎంఎస్ పొందని మాజీ ఉద్యోగులకు మరో అవకాశాన్ని యాజమాన్యం కల్పించింది. నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ కోసం కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్ (సీపీఆర్ఎంఎస్) కార్డు పొందేందుకు చివరి అవకాశమని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ తెలిపారు. ఈమేరకు సంస్థ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. సింగరేణిలో పనిచేసి వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన మాజీ ఉద్యోగులు, వారి భార్యలు సీపీఆర్ఎంఎస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జేబీసీసీఐలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈఏడాది చివరినాటికి మెడికల్ కార్డు తీసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. ఈపథకంలో చేరని వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత వివరాల కోసం గనులు, డిపార్ట్‌మెంట్లలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో ఏటీబీ సెల్‌లో సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



సంపత్ మృతదేహం

కమాన్‌పూర్(మంథని): అనుమానాస్పద స్థితిలో పంపు ఆపరేటర్ మృతిచెందాడు. వివరాలు.. కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీలో పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న పిడుగు సంపత్(45) ఆదివారం గుండారం శివారులోని తన వ్యవసాయ పొలానికి నీరు అందించే విద్యుత్ మోటార్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. కాగా సంపత్ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడా.. లేదా విద్యుత్‌తో చేపలు పట్టే క్రమంలో షాక్ గురై మృతి చెందాడా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈఘటనపై పోలీసులను వివరణ కోరగా.. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



గోదాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

సుల్తానాబాద్‌రూరల్: రాష్ట్రం ఏర్పడ్డాకే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంలను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. సమైక్య రాష్ట్రంలోని పరిస్థితులు.. ఇప్పుడు జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పును గమనించాలని ప్రజలను కోరారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో అనేక పథకాలు ప్రవేశపెట్టారని, తద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని వివరించారు. పనిచేసే సర్కారును ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే దాసరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. సింగిల్‌విండో చైర్మన్ దేవరనేని మోహన్‌రావు మాట్లాడుతూ రైతులకు ఎరువులు, ఫెర్టిలైజరు, విత్తనాలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో చిన్నకల్వల, చిన్నబొంకూర్‌లో రూ.33లక్షల చొప్పున రెండు గోదాంలను నిర్మించుకున్నామని తెలిపారు. సర్పంచ్‌లు రమేశ్, స్వప్న, ఎంపీపీ బాలాజీరావు, గర్రెపల్లి సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, వైస్ చైర్మన్ రాజు, ఎంపీటీసీ ఫక్కీర్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సీఈఓ రమేశ్, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.